అశ్రద్ధ వహిస్తే అనర్థమే

- రసాయన మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి
- మోతాదుకు మించితే పంట దిగుబడికి నష్టం
- రైతులు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు, వ్యవసాయాధికారులు



టమాట పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

గుమ్మఘట్ట: ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్నా..వ్యవసాయం మాత్రం 'వ్యయ'సాయంగా మారింది. రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటల సాగు చేయడంతో పంటలకు రసాయనిక పురుగు మందుల వినియోగం కూడా రోజురోజుకూ పెరిగిపోతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకూ పురుగు మందు వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి. లేని పక్షంలో పంట దిగుబడి దెబ్బతినడంతోపాటు రైతు నష్టాలబారిన పడాల్సి వస్తుంది. అధికంగా పురుగు మందులు వినియోగిస్తే ప్రమాదమని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుందని, తప్పకుండా రైతులు వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని తెలియచేస్తున్నారు.

- రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లి గ్రామానికి చెందిన జనార్దన తనకున్న ఆరు ఎకరాల్లో టమాట పంటను సాగు చేశాడు. ఫెస్టిసైడ్స్ కంపెనీ దుకాణ యజమాని చెప్పిన మోతాదులో పంటకు రసాయన మందు పిచికారీ చేశాడు. దీంతో పంట పూర్తిగా కాలిపోయింది. దీంతో రైతు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.
- గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామానికి చెందిన మారెన్న రెండు ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. కలుపు మందు వినియోగంలో అజాగ్రత్తగా వ్యవహరించడంతో పంట పూర్తిగా మాడిపోయింది. దీంతో పంటల సాగులో రైతుకు అవగాహన లేక, ఎరువులు, రసాయనాలు ఎంత మోతాదులో వాడాలో తెలియక పంట నష్టపోవాల్సి వచ్చింది. ఇలా వీరిద్దరే కాక రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని రైతులు వ్యవసాయాధికారులు, వైద్యుల సూచనలు పాటించకపోవడం వల్ల పంటల దిగుబడి నష్టపోతున్నారు.

రాయదుర్గం నియోజకవర్గంలో 48,354 హెక్టార్లు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 81,809 హెక్టార్లు, ఉరవకొండ నియోజకవర్గంలో 83,456 హెక్టార్లలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. అంతేకాకుండా బోరుబావుల కింద ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులు అధికంగా వినియోగిస్తే భూసారం తగ్గడంతో సహజత్వాన్ని కోల్పోతాయి. దీంతో లాభం కంటే నష్టాలు అధికంగా ఉంటాయి. పంటలకు నీటితడి అందించిన తర్వాత ఉదయం వేళల్లో పంటలకు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో పంటలకు పిచికారీ చేయాలి. రైతులు పలు జాగ్రత్తలు తీసుకుని పిచికారీ చేస్తే ప్రమాదాల నుంచి గట్టెక్కవచ్చని ఇటు వైద్యులు అటు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రసాయనాలు పిచికారీ చేసే సమయంలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలి...

- గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయరాదు.
- తెగులు మందు, పురుగు మందు కలిపి పిచికారి చేయరాదు.
- చేతులకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్కులు వేసుకోవాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరు చేతులతో రుద్దుకోరాదు. వాడిన పురుగు మందుల డబ్బాలు ఎక్కడబడితే అక్కడ వేయరాదు.
- రసాయన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ ఉండరాదు.
- ద్రావణం కలిపే మందు డబ్బాపై సూచించిన మేరకుగాని , వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు గాని పిచికారీ చేయాలి.
- పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు.
- భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలి.

జాగ్రత్తలు పాటించాలి



పంటలపై క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. అస్వస్థతకు గురైన వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. పురుగు మందు పిచికారీ చేసే సమయంలో కళ్లు,ముక్కు, నోటిలోకి రసాయన మందు వెళ్లకుండా జాగ్రత్తలు చేపట్టాలి. వ్యక్తి శరీరం పూర్తి కప్పి ఉండేలా దుస్తులు ధరించాలి. చేతులను శుభ్రంగా కడుక్కుని భోజనం చేయాలి. లేదంటే రసాయన ద్రావణం లోపలికి వెళ్లే ప్రమాదం ఉంది. – **రమేష్, పీహెచ్సీ వైద్యులు, గుమ్మఘట్ట**

మోతాదుకు మించి వాడరాదు



వ్యవసాయ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో పంటకు ఉదయం వేళల్లో పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపు మందు కొట్టి తర్వాత పురుగు మందు కొట్టరాదు. మొక్కల పైభాగంతో పాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చు పురుగులు నశిస్తాయి.

– **లక్ష్మానాయక్, ఏడీఏ రాయదుర్గం**

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



కూడేరులో భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

కూడేరు: అనంతపురానికి చెందిన త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కూడేరులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం చేపట్టారు. పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యాయం 16వ శ్లోకంలో క్షర పురుషుడు అని జీవాత్మ, అక్షర పురుషుడు ఆత్మ, 17వ శ్లోకంలో పురుషోత్తముడు పరమాత్మ గురించి వివరించారు. కార్యక్రమంలో జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, సభ్యులు పక్కీరప్ప, సుధాకర్, విజయలక్ష్మి, నాగమణి, లక్ష్మీనారాయణప్ప, నాగేశ్వరి, మాధవి, గౌరి, ఆదిలక్ష్మి, మోహనమ్మ, యశోద తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఐ ప్రసాద్ సేవలు మరువలేనివి



ఎస్టీఐ ప్రసాద్‌ను సన్మానిస్తున్న డీఎం, ఆర్టీసీ యూనియన్ నాయకులు

ఉరవకొండ: ఎస్టీఐ ప్రసాద్ సేవలు మరువలేనివని ఆర్టీసీ డీఎం బాలాజీ దయాళ్ తెలిపారు. ఆదివారం ఉరవకొండ ఆర్టీసీ డిపోలో ఎస్టీఐగా విధులు నిర్వహిస్తున్న పీవీ ప్రసాద్‌తో పాటు అసిస్టెంట్ గ్యారేజీ మెకానిక్ పీఆర్‌జీ చౌదరి ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్టీఐ ప్రసాద్‌ను డీఎం బాలాజీదయాళ్‌తో పాటు సిబ్బంది, వివిధ యూనియన్ల నాయకులు సన్మానించారు. డీఎం మాట్లాడుతూ ఎస్టీఐగా ప్రసాద్ సేవలు ఎనలేనివన్నారు.

వెంకటేష్ బాబు సేవలు అమోఘం



హెచ్ఎం వెంకటేష్‌బాబు దంపతులను సన్మానించిన దృశ్యం

కూడేరు: మండలంలోని జల్లిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ బాబు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ బాబు దంపతులను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన అందించిన సేవలు అమోఘమని సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు కొనియాడారు. కార్యక్రమంలో సీఆర్పీలు శివ, రమణ, పాఠశాల సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు



అలంకరణలో దశభుజ మహా గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో హాజరై, మొక్కులు తీర్చుకున్నారు.

మంత్రిని కలిసిన అమరావతి జేఏసీ నేతలు



మంత్రిని సత్కరిస్తున్న ఏపీ జేఏసీ నాయకులు

ఉరవకొండ: మండలంలోని కొకుంట్ల గ్రామంలోని రాష్ట్ర ఆర్థిక, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్వగృహంలో ఏపీ అమరావతి జేఏసీ అనంతపురం శాఖ నేతలు ఆదివారం కలిశారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ దివాకరరావు, అసోసియేట్ చైర్మన్ మల్లరాయుడు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్, రాష్ట్ర వర్క్ చార్జడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఖలందర్, ఏపీ జేఏసీ మహిళా వింగ్ చైర్‌పర్సన్ సురేఖరావు, కోశాధికారి నీరజకుమారి, నాగవేణి, కావేరి, హేమవతి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

చేపల వేట నిషేధం

గుమ్మఘట్ట: మండలంలోని బీటీ ప్రాజెక్టు రిజర్వాయర్‌లో చేపల వేటను రెండు నెలల పాటు నిషేధించినట్లు మత్స్య అభివృద్ధిశాఖ అధికారి ఎస్ఎన్ లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రభుత్వ నిబంధనల మేరకు చేపలవేట నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డుకు అడ్డంగా ఆవుల మంద



కళ్యాణదుర్గంలోని వాల్మీకి సర్కిల్‌లో రోడ్డుకు అడ్డంగా నిలిచి ఉన్న పశువుల మంద

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో రోడ్డు అడ్డంగా ఆవుల మంద నిలిచి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆవుల మంద వల్ల వాహనదారులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల రోడ్డుకు అడ్డంగా ఆవులు నిలిచి ఉండడంతో ద్విచక్ర వాహన దారుడు అదుపుతప్పి కింది పడి తీవ్రంగా గాయపడ్డాడు.

అమాత్యా.. ఈ దారివైపు చూడరూ..

ఈ చిత్రం చూడండి.. స్వయానా ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలంలోని చాబాల – ధర్మపురి గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇది. రాళ్లు తేలి రాకపోకలకు ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చాబాల నుంచి ధర్మపురి మీదుగా విడపనకల్ మండల కేంద్రం నుంచి జనార్దనపల్లి వరకు వెళ్లేందుకు ప్రధాన రహదారి ఉంది. ధర్మపురి గ్రామానికి చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం నిత్యం వజ్రకరూరు, ఉరవకొండ తదితర పట్టణాలను వెళ్తుంటారు. ఈ రహదారి గుండా ద్విచక్ర వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత ప్రభుత్వంలోనూ ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మంత్రి పయ్యావుల కేశవ్.. ఈ రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోలేదని, ఇప్పటికైనా చొరవచూపి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– వజ్రకరూరు:



కంకర రాళ్లుతేలి దెబ్బతిన్న చాబాల - ధర్మపురి రోడ్డు

వైకేపీ సీసీకి సన్మానం



వైకేపీ సీసీని సన్మానిస్తున్న సిబ్బంది

గుమ్మఘట్ట: డీఆర్‌డీఏ సెర్ప్ విభాగంలో సీసీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన తిప్పేస్వామిని తోటి సిబ్బంది ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలోని లక్ష్మీ మహిళా మండలి సమైఖ్య కేంద్రంలో సిబ్బంది, మహిళా కార్యవర్గ సభ్యులు శాలువాలు, పూలమాలతో సన్మానించారు. తిప్పేస్వామి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏసీ గంగాధర, ఐదు మండలాల ఏపీఎంలు, సీసీలు, యానిమేటర్లు, మహిళా సంఘాల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: బ్రహ్మసముద్రానికి చెందిన నవ్య అనే విద్యార్థినికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ బద్దేనాయక్ రూ.15వేల ఆర్థిక సాయం ఆదివారం అందించారు. నవ్య తాడిపత్రిలోని ప్రముఖ కళాశాలలో బీఎడ్ పూర్తి చేసింది. ఆర్థికస్తోమత లేక రూ.15 వేల ఫీజు చెల్లించలేక, ఒరిజినల్ సర్టిఫికెట్లు పొందలేకపోవడంతో ఇన్ఫినిటి చారిటబుల్ ట్రస్టు అండగా నిలిచింది. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సురేష్, లోకేష్, ఉపాధ్యాయులు రాజన్న పాల్గొన్నారు.

ఆనందం.. అ'పూర్వ' సమ్మేళనం..



నాలుగు దశాబ్దాల తర్వాత కలిసిన మిత్రులు

కూడేరు: ' ఏయ్ భాగ్యా.. ఎన్ని రోజులైందే నిన్ను చూసి , ఎలా ఉన్నావ్ అంటూ అశ్వర్థమ్మ పలకరింపు... ఏరా రాంకుమార్ (బ్యాంక్ మేనేజర్) హా ఆర్‌యూ అంటూ మల్లికార్జున యాదవ్ (ఉపాధ్యాయుడు).. ఏంటి ఆంజనేయులు (రైతు) పొలంలో ఏం పంటలు పెట్టావంటూ రఘురాం (రైతు)... ఏం రామాంజనేయులు పిల్లలు బాగున్నారా అంటూ నిర్మల పలకరింపు.. ఇలా కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందడి నెలకొంది. ఆదివారం పాఠశాలలో 1979–80 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సమ్మేళనమయ్యారు. నాలుగు దశాబ్దాల తర్వాత అప్పటి మిత్రులంతా కలిశారు. ఎవరెవరు.. ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో ఒకరినొకరులు తెలుసుకున్నారు. పిల్లలు ఏమి చేస్తున్నారు. వారికి పెళ్లిళ్లు అయ్యాయా?.. పిల్లలెంతమంది ఇలా కుశల ప్రశ్నలతో సరదాగా గడిపారు. అక్కడే భోజనాలు చేసి ఫోన్ నంబర్లు ఒకరికొకరు తీసుకున్నారు. నాటి చిలిపి పనులు, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

అయోమయం.. గురుకుల భవన నిర్మాణం



ప్రస్తుతం కుందుర్పిలో కొనసాగుతున్న పాత పాఠశాల భవనం

కుందుర్పి: మండల కేంద్రంలో కొనసాగుతున్న జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణ అంశంలో గందరగోళం నెలకొంది. పాఠశాల భవనాన్ని కుందుర్పిలో నిర్మిస్తారా? ఎనుముల దొడ్డిలో నిర్మిస్తారా? అని విద్యార్థుల తల్లిదండ్రులు, మండల ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు. ఈఏడాది ఫిబ్రవరిలో కుందుర్పి గురుకుల పాఠశాల భవనాల నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో ఎనుములదొడ్డి గ్రామస్తులు తమ గ్రామంలోనే పాఠశాల భవనాలు నిర్మించాలని ఆరు ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులకు చూపించారు. ఇదే సమయంలో మండల కేంద్రంలోనే పాఠశాలను కొనసాగించాలని కుందుర్పికి చెందిన ఓ మహిళ ఐదెకరాల భూమిని ఉచితంగా ఇచ్చేందుకు ముందుకొచ్చింది. దీంతో ఎక్కడ పాఠశాల నిర్మించాలో తెలియక అధికారులు సందిగ్ధంలో పడిపోయారు. ఆతర్వాత సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యింది. దీంతో పాఠశాల భవన నిర్మాణ అంశాన్ని అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు పక్కన పడేశారు. ఇటీవల వారం రోజులుగా పాఠశాల భవన నిర్మాణ విషయం తెరపైకి వచ్చింది. మండలంలో ఏదో ఒక చోట స్థలాన్ని ఎంపిక చేసి, పాఠశాల భవనాన్ని నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీరు



కూడేరులో ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

కూడేరు: డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో కూడేరులో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రధాన రోడ్డు, బస్టాండ్‌కు వెళ్లే రోడ్డుపైన మురుగు నీరు పారుతోంది. దీంతో రోడ్డు పక్కన నివాసమున్న వారు, వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామన్నారు.

నేడు మంత్రి పర్యటన

ఉరవకొండ: పట్టణంలోని ఇందిరానగర్‌లో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొనున్నారు. ఉదయం 8 గంటలకు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

నేడు ఇళ్ల వద్దనే పింఛన్ల పంపిణీ

రాయదుర్గంటౌన్: లబ్ధిదారులకు వివిధ రకాల సామాజిక పింఛన్ల సొమ్మును ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిశోర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బందితోపాటు మున్సిపల్ సిబ్బందితో ద్వారా సోమవారం ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా, సమస్యలు తలెత్తకుండా ఇళ్లవద్దకు వెళ్లి పంపిణీ చేయాలన్నారు. పట్టణంలో మొత్తం 6,777 పింఛన్లకు గాను రూ.4.65 కోట్ల సొమ్ము పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బొమ్మనహాళ్ మండలంలో..

బొమ్మనహాళ్: మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోనూ సోమవారం ఎన్టీఆర్ భరోసా పేరుతో సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ కొనసాగుతుందని తహసీల్దార్ హరినాథరావు, ఎంపీడీఓ సుబ్బరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 5858 మంది పింఛన్‌దారులకు గాను రూ.3.9 కోట్ల నగదును సచివాలయాల అధికారులు పంచాయతీల సెక్రటరీలు ఇంటింటా వెళ్లి అందిస్తారన్నారు. అదేవిధంగా చౌక డిపోల ద్వారా సోమవారం ఉదయం నుంచి వినియోగదారులకు బియ్యం, రాగులు, జొన్నలు ఎండీయూ ఆపరేటర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారన్నారు.

కళ్యాణదుర్గం మండలంలో..

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో జూలై నెలకు సంబంధించి నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత ఆదివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. రేషన్ కార్డుదారులకు బియ్యం, రాగులు, జొన్నలు తప్పక డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు తప్పక పంపిణీ చేయాలన్నారు. నిత్యావసర సరుకులు సక్రమంగా అందకపోతే వినియోగదారులు వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

బ్రహ్మసముద్రం: ఎన్టీఆర్ పింఛన్ భరోసాను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటయిన రాష్ట్ర ప్రభుత్వం అందించే... ఎన్టీఆర్ పింఛన్ భరోసా పథకం జూలై 1న ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నేడు ఇంటింటా రేషన్ పింపిణీ

కణేకల్లు: ఈనెలలో ఎండీయూ వాహనం ద్వారా ఇంటింటా రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఇందిరా రాణి తెలిపారు. చౌకధాన్య డిపోల వద్దకు వెళ్లకుండా ఇంటివద్దే రేషన్ తీసుకోవాలని ఆమె వినియోగదారులకు సూచించారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఎండీయూ వాహనాలు ఇళ్ల వద్దకు వస్తాయన్నారు.

నిబంధనలు పాటించాలి



కొనకొండ్ల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నరేష్

వజ్రకరూరు: వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని ఎస్ఐ నరేష్ తెలియజేశారు. ఆదివారం మండలం కొనకొండ్ల, గూళ్యపాళ్యం, కమలపాడు తదితర గ్రామాల వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఆయా గ్రామాల వ ద్ద ఉరవకొండ–గుంతకల్లు ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే వాహ నాలను తనిఖీచేసి, రికార్డులు పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. అతివేగంతో వాహనాలు నడపకూడదని, ప్రయాణికులు, కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలన్నారు.

వరి సాగుకు సిద్ధమై'నారు'



వరి నాటేందుకు నేలను దుక్కి చేసి సిద్ధం చేసిన దృశ్యం

కూడేరు: కూడేరు మండంలో అన్నదాతలు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి బోరు బావుల కింద వరి పంట సాగుకు సిద్ధమయ్యారు. మండల వ్యాప్తంగా సాధారణంగా సుమారు మూడు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారు. భూగర్భ జలాలు తగ్గి వ్యవసాయ బోరుబావుల్లో నీటి లభ్యత తగ్గింది. కూడేరు, ఇప్పేరు, జల్లిపల్లి, కమ్మూరు, అంతరగంగ, మరుట్ల, కలగళ్ల, ముద్దలాపురం, ఉదిరిపికొండ, శివరాంపేట, కరుట్లపల్లి, చోళసముద్రంతో పాటు మరికొన్ని గ్రామాల్లోని రైతులు నీటి వసతిని బట్టి వరి పంట సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే వరి నాట్ల కోసం వరి నారు సిద్ధం చేసుకున్నారు. వరి నాట్లు వేసేందుకు నేలను ట్రాక్టర్‌తో దుక్కి చేయించారు. కాడెద్దులు లేక ట్రాక్టర్‌కు గంటకు రూ.1200 బాడుగ చెల్లించాల్సి వస్తోందని రైతులు అన్నారు.



నాటేందుకు సిద్ధంగా వరి నారు